సాక్షి
విజయనగరం
బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అసోసియేషన్ ఏకగ్రీవం

ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని మంగళవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. - 8లో



ప్రజల హృదయాల్లో జ్యోతిరావు పూలే స్థానం సుస్థిరం

మహాత్మా జ్యోతి రావు పూలే జాతికి చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని డిప్యుటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కొనియాడారు. - 8లో

నేడు కొత్త పీఓ బాధ్యతల స్వీకరణ



సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పీఓగా కల్పనా కుమారి బుధవారం బాధ్యలు చేపట్టనున్నట్టు కార్యాలయ సిబ్బంది తెలిపారు. పీఓకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఇఫ్తార్ | సహర్
బుధ (సా॥) 6:18 | గురు (ఉ॥) 4:19
రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

విక్రాంత్ పాటిల్‌కు సత్కారం



విక్రాంత్ పాటిల్‌ను సత్కరిస్తున్న ఏపీఎస్‌పీ ఐదో బెటాలియన్ పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు

డెంకాడ: ఏపీఎస్పీ చింతలవలస ఐదవ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేసి పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా బదిలీ అయిన విక్రాంత్ పాటిల్‌ను బెటాలియన్ పోలీస్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో బెటాలియన్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు మిత్తిరెడ్డి అప్పలనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరాడ రామునాయుడు, సంఘం ప్రతినిధులు నారాయణమూర్తి, నాని తదితరులు పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌కు స్వాగతం



పుష్పగుచ్ఛంతో కొత్త కలెక్టర్ నాగలక్ష్మికు స్వాగతం పలుకుతున్న ఎస్పీ దీపికాపాటిల్

విజయనగరం అర్బన్: జిల్లాకు నూతన కలెక్టర్‌గా నియమితులైన నాగలక్ష్మి సెల్వరాజన్‌కు జిల్లా యంత్రాంగం మంగళవారం ఘనస్వాగతం పలికింది. స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో బదిలీపై వెళ్తున్న ఎ.సూర్యకుమారికు వీడ్కోలు, నూతన కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్‌కు స్వాగత సభ నిర్వహించారు. రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ దీపికపాటిల్, జిల్లా జడ్జి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొని కలెక్టర్‌కు స్వాగతం పలికారు.

ఎమ్మెల్యే కళావతి సోదరుడి మృతి

- భోరున విలపించిన కళావతి



పాలకొండ ఏరియా ఆస్పత్రిలో సోదరుడి మృతదేహం వద్ద విలపిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ/వీరఘట్టం: పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఇంట విషాదం అలముకుంది. ఆమె సోదరుడు లక్ష్మణరావు(63) మంగళవారం రాత్రి మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కళావతి ఆస్పత్రికి చేరుకుని సోదరుడి మృతదేహాన్ని చూసి భోరున విలపించారు. ఆమెను ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. దివంగత మాజీ ఎంపీ వండవ దొరకు ఉన్న ఆరుగురు సంతానంలో లక్ష్మణరావు ఏకైక కుమారుడు. ఆయన భార్య మనోరమ గతంలో వండవ ఎంపీటీసీగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన కుమారుడు భార్గవ్ వీరఘట్టం వైస్ ఎంపీపీగా పనిచేస్తున్నారు. లక్ష్మణరావు మరణవార్త తెలియడంతో వండవలో విషాదఛాయలు అలముకున్నాయి. వండవలో బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే కళావతి తెలిపారు.

15 నుంచి చేపల వేట నిషేధం



నిర్మలాకుమారి

విజయనగరం ఫోర్ట్: సముద్రజలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు చేపలవేట నిషేధించినట్టు మత్స్యశాఖ ఉపసంచాలకులు నేతల నిర్మలకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోటారు బోట్లతో చేపలవేట చేయరాదన్నారు. చేప, రొయ్య జాతుల సంతానోత్పత్తి జరిగే కాలం కావడంతో వేటనిషేధం విధిస్తున్నట్టు చెప్పారు. వేట విరామకాలంలో మత్స్యకారుల జీవనోపాధికి ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమచేస్తుందన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పాల్గొన్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్లు సూర్యకుమారి, నిషాంత్‌కుమార్



జెడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

- ఫ్యామిలీ డాక్టర్ సేవలు విజయవంతం చేయాలి
- ప్రజాసమస్యలు, పరిష్కారమార్గాలపై జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చ
- భవిష్యత్ కార్యాచరణపై మార్గనిర్దేశకాలు జారీచేసిన జెడ్పీ చైర్మన్
- తాగునీటిఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక
- హాజరైన ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు

విజయనగరం గంటస్తంభం:

ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రజలకు మెరుగైన సేవలందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలతో ప్రజలకు ఆరోగ్యభరోసా కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. ఊరూరా నిర్వహించే వైద్యశిబిరాలు విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని కోరారు. విజయనగరం జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ అధ్యక్షతన మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు ఎ.సూర్యకుమారి, నిషాంత్‌కుమార్‌తో పాటు ఎంపీ, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వారి ప్రాంతాల్లోని సమస్యలను సభదృష్టికి తెచ్చారు. పరిష్కరించాలని అధికారులను కోరారు.

వైద్యసేవలు సక్రమంగా అందాలి

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని విలేజ్‌క్లినిక్‌లు, సచివాలయ వద్ద నిర్వహించే వైద్యశిబిరాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఉచితంగా మందులు అందజేయాలని, అవసరమైతే శస్త్రచికిత్సలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీపథకం కింద జిల్లా ఆస్పత్రులకు రిఫర్ చేయాలని జెడ్పీ చైర్మన్ సూచించారు. పాఠశాలల విద్యార్థులకు ప్రతినెలా హెచ్‌బీ పరీక్షలు చేసి రక్తహీనత సమస్యను నివారించాలన్నారు. సీహెచ్‌సీలకు అనుబంధంగా పనిచేసే పీహెచ్‌సీల్లో సాంకేతిక సమస్యలను అధిగమించి సేవలను విస్తృతం చేయాలని వైద్యాధికారులకు సూచించారు. బోదకాలు వ్యాధిగ్రస్తులను దివ్యాంగులకు గుర్తించి రూ.3వేలు పింఛన్ మంజూరు చేయాలని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సభ దృష్టికి తీసుకురాగా.. దీనిపై తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించేందుకు సభ ఆమోదం తెలిపింది. అనాథ పిల్లల కోసం నూతనంగా అందుబాటులోకి వచ్చిన మిషన్‌వాత్సల్యకు అధికారులు సహకరించాలని జెడ్పీ చైర్మన్ సూచించారు. అర్హులైన వారికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు మంజూరుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

104, 108 వాహనాలకు ప్రత్యేక షెడ్లు

వివిధ మండలాలకు కేటాయించిన 104, 108 వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఎండలో, వానలో బయటే ఉండడంతో రంగులు వెలిసిపోతున్నాయని సభ దృష్టికి సభ్యులు తెచ్చారు. దీనిపై జెడ్పీ చైర్మన్ సానుకూలంగా స్పందించారు. వాటి కోసం ప్రత్యేకంగా షెడ్లు నిర్మించాలని, దీనికి సంబంధించి అంచనాలను త్వరితగతిన తయారు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇదే సమయంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ స్పందిస్తూ దీనికోసం తన ఎంపీ లాడ్స్ నుంచి నిధులు కేటాయించడానికి సిద్ధమని స్పష్టం చేశారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

వేసవి నేపథ్యంలో విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సభ్యులు కోరారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు వేయించాలని, అవసరమైన చోట విద్యుత్ మీటర్లు వేయించాలన్నారు. గడపగడపలో వచ్చిన సమస్యలపై ప్రతిపాదనలు పంపించామని, వాటికి సంబంధించిన పనులు కాలేదని సభ దృష్టికి తీసుకురాగా... దానికి సంబంధించిన జాబితా పంపించాలని జెడ్పీ చైర్మన్ అధికారులను కోరారు. విభిన్న ప్రతిభావంతుల విభాగం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ ఆలిమ్‌కో ద్వారా దివ్యాంగులకు పరికరాలు అందజేస్తున్నారని, దీనిపైన కూడా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి విభిన్న ప్రతిభావంతులకు సహాయపడాలని సూచించారు.

నిపుణులైన వైద్యులనే సంప్రదించండి

విజయనరం కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ వైద్యసేవల కోసం ఆర్‌ఎంపీలను కాకుండా ప్రభుత్వాస్పత్రుల్లో ఉండే నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆరోగ్యపరమైన అలవాట్లు మార్చుకోవాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ప్రసవాల విషయంలో సిజేరియన్ల సంఖ్య తగ్గాల్సిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. పార్వతీపురం కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గుర్తుచేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నామని వివరించారు. సచివాలయాల ద్వారా సేవలను విస్తృతం చేస్తున్నామని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

సమావేశంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి సభ్యుడు వేపాడ చిరంజీవిరావు, నెల్లిమర్ల, బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పలనాయుడు, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, అలజంగి జోగారావు, జెడ్పీ సీఈఓ అశోక్ కుమార్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొన్నారు.

సమస్యలపై సమగ్ర చర్చ

- గుమ్మడిగూడ పంచాయతీలో గృహ నిర్మాణ లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్లో కనిపించలేదని సంబంధిత జెడ్పీటీసీ సభ్యురాలు సభ దృష్టికి తీసుకురాగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని పార్వతీపురం కలెక్టర్‌కు జెడ్పీ చైర్మన్ సూచించారు.
- బాడంగిలో ఇళ్ల స్థలాలకు సంబంధించి పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వడంలేదని జెడ్పీటీసీ సభ్యుడు తెలియజేయగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని బొబ్బిలి ఆర్డీఓకు కోరారు.
- కొత్తపెంట పంచాయతీలో తలెత్తిన సాంకేతిక ఇబ్బందుల వల్ల జీతాలు రావడం లేదని బొబ్బిలి ఎమ్మెల్యే చెప్పగా మన్యం కలెక్టర్ స్పందిస్తూ చర్యలు తీసుకుంటామన్నారు.
- బొబ్బిలిలో 15 ఏళ్ల కిందట నిర్మించిన ఇళ్లు పాడయ్యాయని, వాటి మరమ్మతులకు నిధులు ఇవ్వాలని జెడ్పీటీసీ సభ్యులు కోరగా ఈ విషయం ముఖ్యమంత్రి పరిశీలనలో ఉందని జెడ్పీ చైర్మన్ తెలిపారు. ఆ ఇంట్లో పెళ్లయిన వారు ఉంటే కొత్త ఇళ్లు ఇస్తారని వివరించారు.
- పాచిపెంటలో మూడు రోడ్ల నిర్మాణానికి ఫారెస్టు క్లియరెన్సు కోసం సభ్యులు అడుగ్గా అధికారులు ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారని తెలిపారు. పాచిపెంట బైపాస్ రోడ్డు మరమ్మతులు ఎంపీపీ సంతోషి కోరగా చర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్టర్‌కు ఆత్మీయ సత్కారం



బదిలీపై వెళ్తున్న కలెక్టర్ సూర్యకుమారిని సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది





కలెక్టర్ సూర్యకుమారిని సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- విజయనగరం జిల్లా పుట్టినిల్లు లాంటిది
- వెనుకబడిన జిల్లా అనొద్దు
- ఎవరి మనసైనా నొప్పించి ఉంటే మన్నించండి: కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం గంటస్తంభం: జిల్లా కలెక్టర్‌గా ఎ.సూర్యకుమారి దాదాపు రెండు సంవత్సరాల పాటు ప్రశంసనీయమైన రీతిలో సేవలందించాలని, తనదైన శైలితో సామాన్యులకు చేరువయ్యారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పరిపాలనలో తనదైన మార్కు వేసుకున్నారని, భవిష్యత్‌లో వచ్చే అధికారులకు మార్గదర్శిగా నిలిచారని కితాబిచ్చారు. జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో భాగంగా కలెక్టర్ ఎ.సూర్యకుమారిని ప్రత్యేకంగా సత్కరించారు. సభ్యులందరూ ఆమె ఆత్మీయ వీడ్కోలు పలికారు. దుశ్శాలువలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి భూ సేకరణ, నిర్వాసిత కాలనీల ఏర్పాటు, సౌకర్యాల కల్పనలో ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా 2700 ఎకరాలు భూసేకరణ ప్రక్రియలో కీలకపాత్ర పోషించారన్నారు. జిల్లా నుంచి బదిలీపై వెళుతూ, పంచాయతీరాజ్ కమిషనర్‌గా జిల్లా ప్రజలకు, సభ్యులకు మరింత దగ్గరవుతున్నారన్నారు. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మాట్లాడుతూ కలెక్టర్ సూర్యకుమారి ప్రజల సమస్యలను సావధానంగా పరిష్కరించేవారన్నారు. పంచాయతీరాజ్ కమిషనర్‌గా ఆమె పదోన్నతి పొందినందుకు సంతోషంగా ఉన్నప్పటికీ, జిల్లా నుంచి బదిలీపై వెళుతున్నందుకు బాధగా కూడా ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ ఎన్నో విధాలుగా బొబ్బిలి ప్రాంతానికి సహాయ సహకారాలు అందించారన్నారు. పార్వతీపురం మన్యంజిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ సూర్యకుమారి కార్యదీక్ష, ప్రత్యేక ప్రణాళికా కలిగిన వ్యక్తి అని కితాబిచ్చారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ జిల్లాలో పని చేసిన కాలం ఎప్పటికీ మరువలేనని, ఇక్కడ ప్రజలు, ప్రజాప్రతినిధుల సంపూర్ణ సహకారంతో నా మనసుకు దగ్గరయ్యారని పేర్కొన్నారు. మార్చి నెలకు సర్వీసులోకి వచ్చి 27 ఏళ్లయ్యిందని, జిల్లాలో పని చేసిన కాలం మాత్రం ప్రత్యేకమని చెప్పారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళుతున్నప్పటికీ తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ పనిచేసిన కాలంలో తెలిసో, తెలియకో ఎవరి మనసైనా నొప్పించి ఉంటే క్షమించాలని కలెక్టర్ సూర్యకుమారి ఈ సందర్భంగా కోరారు. విజయనగరం జిల్లా తనకి పుట్టినిల్లు లాంటిదని దానిని తక్కువ చేసి ఎవరూ మాట్లాడొద్దన్నారు. ఇక నుంచి వెనుకబడిన జిల్లాగా పేర్కొనవద్దని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసన మండలిసభ్యులు, శాసనసభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ విభాగాల అధికారులు, జెడ్పీ సీఈఓ, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌లు నడిపే మైనర్లకు కౌన్సెలింగ్

- ఎస్పీ ఎం.దీపిక



విజయనగరం కాంప్లెక్స్ వద్ద బైక్‌పై వస్తున్న మైనర్లను పట్టుకుని కౌన్సెలింగ్ చేస్తున్న ట్రాఫిక్ పోలీస్

విజయనగరం క్రైమ్: జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, రాజాం పట్టణాల్లో మైనర్ల డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, ట్రిపుల్ రైడింగ్, నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడిపై మంగళవారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. పట్టణంలోని గంటస్తంభం, కోట, ఎత్తుబ్రిడ్జి, కలెక్టరేట్, ఆర్టీసీ కాంప్లెక్స్, దాసన్నపేట, బాలాజీ జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ కూడలి, ఫూల్‌బాగ్, జమ్ము నారాయణపురం తదితర 23 ప్రాంతాల్లోనూ, రాజాం, బొబ్బిలి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పోలీసులు వాహన తనిఖీలు చేశారన్నారు. మైనర్లకు రోడ్డు భద్రత నియమాల పట్ల అవగాహన లేకపోవడం, వాహనాల వేగాన్ని నియంత్రించలేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహన తనిఖీల్లో పట్టుబడిన మైనర్లకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి, అతివేగంతో వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరించామని చెప్పారు. స్పెషల్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై 18 కేసులు, మైనర్ డ్రైవింగ్‌పై 125 కేసులు, నంబర్ ప్లేట్స్ సక్రమంగా లేని వాహనదారులపై 70 కేసులు, ట్రిపుల్ రైడింగ్‌పై 40 కేసులు నమోదుచేసినట్టు వెల్లడించారు. ఈ తరహా స్పెషల్ డ్రైవ్‌లు భవిష్యత్‌లో నిరాటంకంగా కొనసాగుతాయన్నారు.

● రోడ్డంతా పంట



చిత్రంలో కనిపిస్తున్నది కళ్లాం కాదు. మెరకముడిదాం మండలం చినబంటుపల్లి నుంచి చెల్లాపురం వెళ్లే ప్రధాన రోడ్డు. ఈ ప్రాంత రైతులు మొక్కజొన్న గింజలను రోడ్డుపైనే ఆరబెడుతున్నారు. కనీసం రోడ్డుపై ద్విచక్రవాహనం వెళ్లేందుకు కూడా తోవ ఉండడంలేదంటూ వాహనచోదకులు గగ్గోలుపెడుతున్నారు. రోడ్డు పక్కగుండా రాకపోకలు సాగిస్తున్నారు. పోలీసులు స్పందించి రోడ్డుపై మొక్కజొన్న గింజలు ఆరబెట్టకుండా చూడాలని కోరుతున్నారు.

– మెరకముడిదాం

సైన్స్ పరీక్షకు రెండు జవాబు పత్రాలు

విజయనగరం ఫూల్‌బాగ్: పదోతరగతి సైన్స్ పరీక్షకు ఓఎమ్మార్ షీట్‌తో కూడిన 12 పేజీల బుక్‌లెట్‌లు రెండు ఇస్తామని, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ ప్రశ్నలకు జవాబులు వేర్వేరు బుక్‌లెట్‌లలో రాయాల్సి ఉంటుందని, విద్యార్థులకు ఇన్విజిలేటర్లు అవగాహన కల్పించాలని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రశ్నపత్రంలో పార్ట్‌-ఎ నందు ఫిజికల్‌సైన్స్ ప్రశ్నలు క్రమసంఖ్య 1 నుంచి 16వరకు, పార్ట్‌-బిలో బయలాజికల్ సైన్స్ ప్రశ్నలు క్రమసంఖ్య 17 నుంచి 33 వరకు ముద్రించినట్టు పేర్కొన్నారు. ఫిజికల్‌సైన్స్ ఓఎమ్మార్‌పై పేపర్‌కోడ్‌-19, పేపర్ సైన్స్ పి–1 అని, బయలాజికల్ సైన్స్ ఓఎమ్‌ఆర్‌పై పేపర్‌కోడ్‌-20, పేపర్ పేరు సైన్స్ పి–2 అని ముద్రించబడి ఉన్నాయన్నారు. సమాధానాలు రాసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రతివిద్యార్థికీ జగనన్న విద్యాకానుక

- కేజీబీవీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎన్.గీత



ఎంఈఓ కూర్మారావుతో సమావేశమైన కేజీబీవీ రాష్ట్ర జాయింట్ కార్యదర్శి ఎన్.గీత

లక్కవరపుకోట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థికి జగనన్న విద్యాకానుక కిట్లను అందించాల్సిందేనని కేజీబీవీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్.గీత అన్నారు. మండలంలోని ఆదర్శపాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న విద్యాకానుకుల స్టాక్ పాయింట్‌ను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి సీహెచ్.కూర్మారావుకు జేవీకే కిట్ల భద్రతపై పలు సూచనలు చేశారు. పాఠశాలల ప్రారంభం రోజున విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేసేందుకు వీలుగా మండలాల వారీగా స్టోర్ రూమ్‌లను గుర్తిస్తున్నామని చెప్పారు. పదో తరగతి పరీక్షలు పూర్తయిన వెంటనే జేవీకే కిట్లను మండలాలకు చేర్చుతామన్నారు. అనంతరం ఎల్.కోట కేజీబీవీను ఆమె పరిశీలించారు. బాలికలకు అందజేస్తున్న మెనూపై ఆరా తీశారు. 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పరీక్షలు చక్కగా రాయాలని సూచించారు. బాలికలకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రత్యేక అధికారిణి బలిరెడ్డి ప్రవీణకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ ప్రసాద్, స్థానిక ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ కంది ధర్మకుమార్ పాల్గొన్నారు.

3.41లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

- రైతన్నకు గడువులోగా బిల్లుల చెల్లింపు
- తొలిసారిగా క్వింటాకు అందిన రూ.2వేలు దాటి మద్దతు ధర
- రూ.695.45 కోట్ల చెల్లింపు
- ఆనందంలో రైతన్నలు



ఈ చిత్రంలోని రైతు పేరు తెంటు కాశీ విశ్వనాథ్. ఎకరా పొలంలో వరి పండించగా 20 బస్తాల దిగుబడి వచ్చింది. ఇంటి అవసరాలు మినహాయించి 15 బస్తాలను విక్రయించాడు. వారం రోజుల్లోనే ఇతని వ్యక్తిగత ఖాతాకు రూ.30,600 నగదు జమయింది. దీంతో సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



మరాడుతున్న మిల్లు

బొబ్బిలి: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు దాదాపుగా పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 90వేల మంది రైతుల నుంచి 3.41లక్షల టన్నుల ధాన్యంను రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. క్వింటాకు గ్రేడ్‌ను బట్టి రూ.2040 నుంచి రూ.2060 చొప్పున 89,474 మంది రైతుల వ్యక్తిగత ఖాతాలకు రూ.695.45 కోట్లను జమచేసింది. మరో రూ.2కోట్ల పెండింగ్ నగదు చెల్లించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ధాన్యం తరలించిన 21 రోజుల్లోనే (కొందరికి వారంలోపునే) వారి వ్యక్తిగత ఖాతాలలోకి నగదు జమచేయడం, గోనె సంచులు, రవాణా ఖర్చులను కూడా చెల్లించడంతో రైతులు సంతోషపడుతున్నారు.



చిత్రంలోని రైతు పేరు జామి రాము. బొబ్బిలి మండలం లక్ష్మీపురం గ్రామం. ఇతను దొంకినవలస రెవెన్యూ పరిధిలోని పొలంలో ఖరీఫ్‌లో వరి సాగుచేసి 5.2 క్వింటాళ్లు పండించాడు. సమీపంలోని కొనుగోలు కేంద్రానికి తరలించగా రూ.10,608లు పది రోజుల్లోనే నగదు తన ఖాతాకు జమకావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

అందరికీ చెల్లింపులు



జిల్లాలో దాదాపు 90 వేల మంది రైతులకు రూ.695.41కోట్లను చెల్లించాం. కొంత మంది రైతులకు ఆధార్ లింక్ నమోదు కాకపోవడం, బాంకు లింకు కాకపోవడం వంటి సమస్యలను సరిచేసి క్రమంగా చెల్లింపులు చేస్తున్నాం.

– కె.మీనాకుమారి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ, విజయనగరం

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి దగ్ధం



బొలెరో వాహనంపై గడ్డికి అంటుకున్న మంటలను అదుపు చేస్తున్న స్థానికులు

కొత్తవలస: మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామం సమీపంలో విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్ జరగడంతో బొలెరోపై తరలిస్తున్న వరి గడ్డి దగ్ధమైంది. దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన జి.ఈశ్వరరావు పశువుల మేతకోసం వేపాడ మండలం బొద్దాం గ్రామంలో వరి గడ్డిని కొనుగోలు చేశాడు. ఆ గడ్డిని మంగళవారం తన స్వగ్రామానికి బొలెరో వాహనంపై తీసుకువస్తుండగా ఇంటి సమీపంలో గల ఎల్‌టీ లైన్ గడ్డిని తాకడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో పెద్ద ఎత్తున పొగలు రావడంతో స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పేందుకు సిద్ధమయ్యారు. అలాగే స్థానికుల సమాచారం మేరకు కొత్తవలస అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.10వేలు విలువైన గడ్డి కాలిపోయినట్లు రైతు వాపోయాడు.

చెట్టును ఢీకొన్న లారీ



చెట్టును ఢీకొన్న లారీని బయటకు తీస్తున్న క్రేన్

బొండపల్లి: మితిమీరిన వేగంతో విజయనగరం నుంచి గజపతినగరం వైపు వస్తున్న బెంజ్ లారీ అదుపు తప్పి జాతీయ రహదారి 26 పక్కన గల మామిడి చెట్టును ఢీకొంది. మంగళవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు భారీ ప్రమాదం జరగకుండా డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇక లారీ రోడ్డుకు అడ్డంగా జాతీయ రహదారిపై నిలిచి పోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని అడ్డంగా నిలిచి పోయిన లారీని భారీ క్రేన్ సహాయంతో పక్కకు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

గంజాయి పీలుస్తున్న నలుగురి అరెస్టు

విజయనగరం క్రైమ్: గంజాయి పీలుస్తున్న నలుగురు యువకులను రూరల్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. స్థానిక వేణుగోపాలపురం వద్ద ఉన్న డైట్ కళాశాల సమీపంలో గల ఖాళీస్థలంలో గంజాయి పీలుస్తున్న నలుగురు యువకులను సీఐ తిరుపతిరావు, ఎస్సై గణేష్‌ల ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తిరుపతి రావు తెలిపారు.

మైనర్లకు బైకిలిస్తే కఠినచర్యలు

మైనర్లకు బైకులిస్తే తల్లిదండ్రులపై చట్టప్రకారం చర్యలు తప్పవని టూటౌన్ సీఐ సీహెచ్. లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి పట్టణంలోని టూటౌన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రంకన్ డ్రైవ్‌తో పాటు మైనర్లు బైక్‌లపై విచ్చలవిడిగా తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. దీంతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, కేసులు నమోదుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై పైడితల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాం సిటీ: గత నెల 16న ప్రమాదంలో గాయపడిన చెల్లూరి విశ్వనాథం (59) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపారు. ఎస్సై వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. తెర్లాం మండలం పెదపాలవలస గ్రామానికి చెందిన చెల్లూరి విశ్వనాథం, చిన్నకుమారుడు శ్రీనివాసరావుతో కలిసి జి.సిగడాంలో నివాసం ఉంటున్న తన పెద్ద కుమారుడు గౌరీశంకర్ ఇంటికి వెళ్లేందుకు రాజాం వచ్చారు. బస్టాండ్‌లో తన కోసం ఎదురుచూస్తున్న కుమారుడి వద్దకు నడుచుకుంటూ ఇన్‌గేటు వైపు వచ్చాడు. అదే సమయంలో కాంప్లెక్స్‌లోకి వస్తున్న బస్సు ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయాడు. వెంటనే గమనించిన కుమారుడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సనందించాడు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం విశాఖపట్నం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,150–00
బంగారం(22కి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190

నిర్లక్ష్యం వహిస్తే.. మిగిలేది బూడిదే..!



- వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి
- ఈనెల 14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



గ్యాస్ మంటల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

గుమ్మలక్ష్మీపురం: ఎండా కాలం మండించే కాలం. అధిక ఉష్ణోగ్రతలతో ఏదో ఒక చోట అగ్ని ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. విద్యుదాఘాతం, సిగరెట్, చుట్ట, బీడీ కాల్చి ఆర్పివేయకుండా పడేయడంతో కూడా ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రకృతి వైపరీత్యాలతో జరిగే అగ్ని ప్రమాదాలను పక్కన పెడితే మానవ తప్పిదాలతో సంభవించే ప్రమాదాలే అధికమని అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వేసవిలో అజాగ్రత్తగా ఉంటే అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. వాటిని ముందు జాగ్రత్తలతో అరికట్టవచ్చని, తద్వారా ఆస్తి, ప్రాణనష్టాల్ని నివారించవచ్చని అగ్నిమాపక విపత్తుల నివారణ అధికారులు చెబుతున్నారు.

ఏడాదిలో 125 ప్రమాదాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పాలకొండ, పార్వతీపురంలలో అగ్నిమాపక కేంద్రాలుండగా వాటి పరిధిలో 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు 125 అగ్ని ప్రమాదాలు జరగ్గా, రూ.79,75,360లు ఆస్తినష్టం సంభవించింది. అలాగే మరికొన్ని అగ్ని ప్రమాదాల్లో రూ.3,28,83,500ల మేర ఆస్తినష్టం సంభవించకుండా కాపాడినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు.

ఇలా జాగ్రత్తలు పాటిద్దాం..

వంట గ్యాస్ వాడకం తర్వాత రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి. బయట నుంచి ఇంట్లోకి వచ్చినప్పుడు గ్యాస్ వాసన వస్తే లైట్లు, ఫ్యాన్ వేయడం వంటివి చేయరాదు. వెంటనే అగ్ని మాపక అధికారులకు సమాచారం అందివ్వాలి. సిగరెట్, చుట్ట, బీడీ వెలిగించిన వారు పడేసేటప్పుడు పూర్తిగా ఆర్పివేయాలి. ఇళ్లను వదిలి వెళ్లే వారు కరెంట్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. దీనివల్ల వేడికి తీగలు షార్ట్ సర్క్యూట్ అయినా విద్యుత్ ఇంట్లోకి ప్రవేశించకుండా ఉంటుంది. వంట చేసే మహిళలు కాటన్ దుస్తులను ధరించాలి. అగ్గి పెట్టెలు, లైటర్లు, ఒత్తి దీపాల నుంచి చిన్నారులను దూరంగా ఉంచాలి. అగ్ని ప్రమాదం ఇళ్లలో, షాపుల్లో సంభవించినప్పుడు తలుపులు మూసి వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. లేదా 101కు ఫోన్ చేయాలి. అగ్ని ప్రమాదం వల్ల అతిగా పొగ వెలువడి ఊపిరి అందదు. ఆ సమయంలో మంటల నుంచి తప్పించుకోవడానికి నేల మట్టాన్ని తాకుతూ బాధితులు ముందుకు వెళ్లాలి. దీనివల్ల ప్రమాద తీవ్రత నుంచి తప్పించుకోవచ్చు.

14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

అగ్ని ప్రమాదాల నివారణ పట్ల ప్రజలు, విద్యార్థులను చైతన్య పర్చేందుకు ఏటా ఏప్రిల్ 14వ తేదీ నుంచి అగ్నిమాపక వారోత్సవాలను ఆ శాఖ అధికారులు నిర్వహిస్తుంటారు. 1944వ సంవత్సరంలో ముంబై జరిగిన అగ్ని ప్రమాదంలో 66 మంది అగ్నిమాపక సిబ్బంది చనిపోవడంతో వారి జ్ఞాపకార్థం సంతాప దినాలు పాటిస్తూనే వారిలా మరెవరూ అగ్నిప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకోకూడదన్న ఉద్దేశంతో అగ్నిమాపక వారోత్సవాలు ఏటా నిర్వహిస్తున్నామని అగ్నిమాపక శాఖ అధికారులు వివరిస్తున్నారు.

అజాగ్రత్తతోనే ప్రమాదాలు

వేసవి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అజాగ్రత్తతోనే అగ్ని ప్రమాదాలు అధికంగా సంభవిస్తున్నాయి. అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వాలి. సరైన సమయంలో సమాచారం చేరవేస్తే, ఆస్తి, ప్రాణనష్టాన్ని తగ్గించడానికి వీలుంటుంది.

– డి.శ్రీరాములు, అగ్నిమాపక కేంద్రం అధికారి (ఎఫ్‌ఎస్‌ఓ), గుమ్మలక్ష్మీపురం

పైడితల్లికి పుష్పాలంకరణ



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం భక్తులకు పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం సిరిమానుపూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన బూరెలతో నైవేద్యం సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జీసీసీ షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చర్యలు

- స్థల పరిశీలన చేసిన అధికారులు



స్థల పరిశీలన చేస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, జీసీసీ డీఎం మహేంద్ర

పార్వతీపురంటౌన్: జీసీసీ షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని జీసీసీ డివిజినల్ మేనేజర్ మహేంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం పరిధిలో గల వెంకంపేట పంచాయతీ యర్రా కృష్ణమూర్తి నగర్‌లో గల జీసీసీ స్థలాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి విష్ణుచరణ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీసీసీ డివిజినల్ బ్రాంచ్ ఆఫీస్ డీఆర్ గోడౌన్ నిమిత్తం ప్రతిపాదనలు జీసీసీ ఎం.డికి పంపామన్నారు. పార్వతీపురం జిల్లాలో గిరిజనులు సేకరించే అటవీ ఫలాశాయాల వేల్యూ ఆడిషన్ కింద తయారు చేసి ఆ ఉత్పత్తులను బయట మార్కెట్లో విక్రయిస్తే గిరిజనులకు గిట్టుబాటవుతుందన్నారు. ప్రస్తుతం గిరిజనులు సేకరించే అన్ని అటవీ వ్యవసాయ చిరు ధాన్యాలకు మంచి గిరాకీ ఉందని అందరూ ఆర్గానిక్ ఉత్పత్తులనే వాడుతున్నారన్నారు. అందుకు తగ్గట్టుగా రిటైల్ మార్కెటింగ్ కౌంటర్లు ఏర్పాటు చేసి గిరిజన యువతకు ఉపాధి కల్పించాలని, అందుకు అవసరమయ్యే కౌంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జీసీసీ అభివృద్ధి కోసం ప్రాజెక్ట్ ఆఫీసర్, డిప్యూటీ సీఎం రాజన్నదొర సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అసోసియేషన్ ఏకగ్రీవం

- అధ్యక్షుడిగా ప్రయాగుల పైడిరాజు, కార్యదర్శిగా నరసింహులు



ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని మంగళవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌వీశివప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యాలయంలో జరిగిన ఎన్నిక ప్రక్రియలో ఈ మేరకు నూతన కమిటీని ప్రకటించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ప్రయాగుల పైడిరాజు, కార్యదర్శిగా ఎ.నరసింహులు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.భానుప్రసాద్ ఎంపికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా భరద్వాజ్ చక్రవర్తి వ్యవహరించే ఈ కమిటీలో వైస్ ప్రెసిడెంట్స్‌గా ఎ.కిశోర్, వి.బాబ్జీ, జాయింట్ సెక్రటరీలుగా జీవీఎస్ఎన్ మూర్తి, పి.రవికుమార్, కోశాధికారిగా ఎస్.శంకరరావుతో పాటు వివిధ ఎలక్ట్రానిక్ మీడియా నుంచి మరో 8 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పి.అప్పారావు, విజయనగరం ప్రెస్ క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు జీవీప్రసాద్, ఎలిశెట్టి సురేష్‌కుమార్, వీఎంకే లక్ష్మణరావు, వైఎస్‌పంతులు, టి.రాధాకృష్ణ, వేదుల సత్యనారాయణ, ఎం.భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే అనుబంధ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది.

ప్రజల హృదయాల్లో జ్యోతిరావు పూలే స్థానం సుస్థిరం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- ఘనంగా మహాత్మా జ్యోతి రావు పూలే 197వ జయంతి



కలెక్టరేట్ ప్రాంతంలో విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

విజయనగరం: మహాత్మా జ్యోతి రావు పూలే జాతికి చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కొనియాడారు. పూలే 197వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ సమీపంలోని జ్యోతి రావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్లతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన వెంకటఅప్పల నాయుడు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కృషి చేసిన జ్యోతి రావు పూలే మహనీయుడని కొనియాడారు. బాలికా విద్యకు ఆయన ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని, బాలికలకోసం, వెనుకబడిన వర్గాల కోసం పాఠశాలలు స్థాపించారని చెప్పారు. దీని కోసం తన భార్య సావిత్రిబాయిని చదివించి, దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిని చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ జ్యోతి రావు పూలే జాతికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఉద్ఘాటించారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. అందుకే 197 సంవత్సరాల క్రితం పుట్టిన జ్యోతి రావు పూలే, ప్రజల హృదయాల్లో నేటికీ నిలిచిఉన్నారని కొనియాడారు. వారి ఆశయాలను సాధించడమే ఆయనకు నిజమైన నివాళిగా పేర్కొన్నారు. అనంతరం టాటా కన్సల్టెన్సీ దేశవ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతి సాధించిన బీసీ హాస్టల్ విద్యార్థి కె.మణికంఠను ఈ సందర్భంగా సత్కరించారు. విద్యార్థికి వసతిగృహ సంక్షేమాధికారి బి.జానకిరావు సొంతంగా రూ.5వేల నగదు బహుమతిని అతిథుల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, బొబ్బిలి శాసన సభ్యుడు శంబంగి వెంకట చినప్పలనాయుడు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎం.యశోదనరావు, వివిధ బీసీ సంఘాలు, సంస్థలు, పార్టీల ప్రతినిధులు ఆశపు వేణు, ముద్దాడ మధు, భీశెట్టి బాబ్జీ, రెడ్డి పావని, నడిపేన శ్రీనివాసరావు తదితరులతోపాటు బీసీ సంక్షేమాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటా ఆనందం

- డిప్యూటీ సీఎం రాజన్నదొర



జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: గడిచిన నాలుగేళ్లుగా జగనన్న పాలనలో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరుస్తోందని, ప్రభుత్వం పథకం మంజూరుకాని ఇల్లే లేదని డిప్యూటీ సీఎం, గిరిజనశాఖామంత్రి పీడిక.రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మెంటాడ గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రతి ఇంటి దగ్గర కనీసం 15నిమిషాల పాటు వారితో మాట్లాడి, ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మద్దతు తెలిపినవారంతా 8296082960 నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. మిస్డ్ కాల్ ఇచ్చిన మరుక్షణమే లబ్ధిదారుకి కతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం జగన్ సందేశంతో కూడిన ఐవీఆర్ఎస్‌కాల్ ఆ కుటుంబాలకు వచ్చింది. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి గోడకు వారి అనుమతితో సీఎం జగన్ ఫొటోతో కూడిన స్టిక్కరును అతికించారు. అనంతరం కంటుభుక్తవలస, చల్లపేట, కొంపంగి, మీసాలపేట గ్రామాలలో కూడా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై మంత్రి ఆరా తీశారు.

మంత్రికి సత్కారం

గిరిజనశాఖామంత్రిగా పదవి చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా స్థానిక నాయకులు రాజన్నదొరకు దుశ్శాలువతో సత్కరించారు. ఈ ఏడాది పాలనలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా రాష్ట్ర ప్రజలకు సేవలు అందించినందుకుగాను రాజన్నదొర వంటి నాయకుడి అవసరం ఎంతైనా ఉందని వారంతా అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి. సన్యాసినాయుడు, గృహసారథుల మండల కన్వీనర్ కె.త్రినాథరావు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు లెంక రత్నాకర్‌నాయుడు, రెడ్డి రాజప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ రేగిడి రాంబాబు, సిరిశెట్టి నారాయణరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

నేడు 'అరబిందో' జాబ్ మేళా

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల



ప్రిన్సిపాల్ చలపతిరావు

పార్వతీపురం టౌన్: స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింత చలపతిరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రసిద్ధి గాంచిన అరబిందో ఫార్మా కంపెనీలో వివిధ రకాలకు చెందిన 275 ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలను స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో కంపెనీ ప్రతినిధులు నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్మీడియట్, బీఎస్సీ కెమిస్ట్రీ, బి.ఫార్మసీ, మెకానికల్ డిప్లమో కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు వారి వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వైబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. అన్ని ధ్రువీకరణ పత్రాల(ఒరిజనల్, నకలు)తో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, ఫొటో తదితర ఆధారాలు తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకోసం జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి యు.సాయికుమార్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

12 మద్యం సీసాల పట్టివేత



వేపాడ: పట్టుబడిన వ్యక్తి, మద్యం సీసాలతో ఎస్సై రాజేష్, సిబ్బంది



నెల్లిమర్ల రూరల్: పట్టుబడిన మద్యం సీసాలతో పోలీసులు



పూసపాటిరేగ: స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్సై నారాయణరావు

వేపాడ: మండలంలో నీలకంఠరాజపురం పంచాయతీ భర్తవానిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 12 మద్యం బాటిల్స్ పట్టుబడినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. గ్రామానికి చెందిన కొల్లి బంగారయ్య వద్ద పట్టుబడిన మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సతివాడలో బెల్టు షాపుపై దాడి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టు షాపుపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. సతివాడ జంక్షన్‌లో గల టీ టైం సమీపంలో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయంటూ వచ్చిన ముందస్తు సమాచారంతో ఎస్సై నారాయణరావు, సిబ్బంది దాడులు నిర్వహించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. షాపులో ఉన్న 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం అమ్మకాలు సాగిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించామని ఎస్సై నారాయణరావు తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

నెల్లిమర్ల(పూసపాటిరేగ): పూసపాటిరేగ మండలంలోని గోవిందపురం గ్రామంలో అక్రమంగా మద్యం బాటిల్స్ తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్సై ఎ.నరేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. గోవిందపురం గ్రామానికి చెందిన పి.రామకృష్ణ బెల్టు షాపు నిర్వహిస్తున్నాడు. వైన్ షాపు నుంచి బెల్టు షాపునకు మద్యం తరలిస్తుండగా గ్రామ పరిధిలో పోలీసులు పట్టుకుని 47 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం తరలించినా, బెల్టు షాపులు నిర్వహించినా తమకు సమాచారం అందించాలని ఎస్సై నరేష్ కోరారు.

సీఎంకు కృతజ్ఞతలు

విజయనగరం పూల్‌బాగ్: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగులకు ఐదురోజులు అదనపు సెలవులు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.అప్పలసూరి, బి కాంతారావు మంగళవారం ఒకప్రకటనలో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని విభాగాల మహిళాఉద్యోగులకు ఈ జీవో అమలు అయ్యే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగులకు కూడా చైల్డ్‌కేర్ లీవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

బ్లేడ్‌తో కోసుకున్న వ్యక్తి



108లో సూరిబాబుకు చికిత్స అందిస్తున్న టెక్నీషియన్ దేముడు

వేపాడ: కుటుంబసభ్యులు తాగుడు వద్దారన్న కోపంతో మండలంలోని ఆతవ గ్రామానికి చెందిన మిరియాల సూరిబాబు మద్యం మత్తులో బ్లేడుతో పీక కోసుకున్నాడు. ఇందుకు సంబంధించి 108 సిబ్బంది, వల్లంపూడి ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సూరిబాబు మూడు రోజులుగా మద్యం మత్తులో ఉండడంతో మంగళవారం తల్లి, భార్య కాంత కుటుంబీకులు తాగుడు తగ్గించమని చెప్పి పెద్దలవద్దకు పిలిపించడంతో మద్యం మత్తులో ఉన్న సూరిబాబు బ్లేడ్‌తో కోసుకోవడానికి ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు ఆపడంతో బయటకు వెళ్లి కోసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు వేపాడ నుంచి హుటాహుటిన చేరుకున్న 108 టెక్నీషియన్ ఎస్.దేముడు పైలెట్ ప్రకాష్ ప్రథమ చికిత్స చేసి ఆక్సిజన్ అమర్చి ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై రాజేష్ బ్లేడ్‌తో పీకకోసుకున్న సూరిబాబు వాగ్మూలం నమోదు చేశారు.